KANCHARLA
# మనసులో మాట
నిజమే మా బలం.. అదే మా నిర్భయం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

| రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ |
| --- | --- | --- |
| అమలాపురం తణుకు | ఏలూరు | భీమవరం |

శనివారం 11 జూలై 2026 పేజీలు 16



### "వేతనాల పెంపు.. సంక్షేమ హామీల అమలుకు

# అంగన్వాడీల గళం"

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

బొమ్మూరు కలెక్టరేట్ జూలై 10 అంగన్వాడీల జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో బొమ్మూరు తూర్పుగోదావరి కలెక్టరేట్ ఎదుట బారీ ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వ హామీ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, హెల్త్ డిపార్ట్మెంట్ నవచేతన యాప్ పని అంగన్వాడీల చేత చేయించడాన్నీ మానుకోవాలని, అంగన్వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వర్షంలో కూడా ధర్నా కొనసాగింది. అనంతరం బొమ్మూరు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష ..మిగతా 2లో

- కూటమి హామీలు అమలు చేయాలి..
- పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ కల్పించాలి
- నవచేతన యాప్ పనులు నిలిపివేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.. అంగన్వాడీల డిమాండ్
- వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీల కలెక్టరేట్ ధర్నా



## తీపర్రులో 'మా గోదావరి సంకల్ప్'

- మెరుగైన రవాణా సౌకర్యం, అందమైన ఘాట్
- తీపర్రు ను మోడల్ ఘాట్ ఎంపిక
- తదేకం ఫౌండేషన్ సేవలను అభినందించిన
- మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు (మనసులో మాట) జూలై 10**

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలోని 'తీపర్రు' గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్ ను మోడల్ ఘాట్ గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ మేరకు తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం (జూలై 11, 2026) మధ్యాహ్నం 3 గం.లకు తీపర్రు గ్రామంలో నిర్వహించనున్న మా గోదావరి సంకల్ప్ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ..మిగతా 2లో

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌కు ప్రత్యేక డ్రైవ్



- పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలు.. ఎన్యుమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ వేగవంతం
- అర్హులైన ఓటరు ఒక్కరూ మిగలొద్దు
- జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 11, 12 తేదీల్లో సర్ ప్రక్రియపై ప్రత్యేక శిబిరాలు నిర్వహణ
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

3

### ఓటు హక్కు భద్రం కావాలంటే...

# ఫారమే కీలకం!



- ఎన్యుమరేషన్ ఫారంలో చిన్న తప్పిదం చేసినా ఓటుపై ప్రభావం
- కొత్త కలర్ ఫొటో తప్పనిసరి.. ఫారం ఇచ్చిన తర్వాత రసీదు తప్పక తీసుకోవాలి

**ఐ. పోలవరం (మనసులో మాట )జులై 10:**

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు ఓటు. ఆ హక్కును ప్రతి అర్హుడికి కల్పించడంతో పాటు ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత. ఇందులో భాగంగానే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. బూత్ లెవల్ అధికారులు ..మిగతా 2లో

## జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి

8






## ఓటు హక్కు భద్రం కావాలంటే...

# ఫారమే కీలకం!

(మొదటిపేజీ తరువాయి)

(బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. ఈ ఫారాన్ని నిర్లక్ష్యంగా నింపితే భవిష్యత్తులో ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ, పోలింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ఎన్యుమరేషన్ ఫారం ఎందుకు:**
ఓటరు వివరాలను ధ్రువీకరించడం, కొత్త ఓటర్ల సమాచారాన్ని నమోదు చేయడం, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర మార్పులను నమోదు చేయడం కోసం ఎన్నికల సంఘం ఈ ఫారాన్ని ఉపయోగిస్తోంది. ఇందులో ఇచ్చే ప్రతి సమాచారం స్పష్టంగా, సరైన ఆధారాలతో ఉండాలి.

**2002 నాటికి ఓటు ఉంటే:**
2002 జనవరి 1 నాటికి ఓటు హక్కు ఉన్న వారు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు నంబరు, పేరు, తండ్రి లేదా భర్త పేరు, శాసనసభ నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ (భాగం సంఖ్య), ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య వంటి వివరాలను నమోదు చేయాలి.

**2002లో ఓటు లేకుంటే:**
ఆ సమయంలో ఓటు లేకపోయినా, తల్లిదండ్రులు, తాతయ్య, నానమ్మ లేదా కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఓటు ఉంటే వారి వివరాలను నమోదు చేయాలి. వారి ఓటరు గుర్తింపు కార్డు నంబరు, నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్, క్రమ సంఖ్య వంటి వివరాలు ఇవ్వడం వల్ల నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది.

**కొత్త కలర్ ఫొటో తప్పనిసరి:**
ఫారంపై ఇప్పటికే ముద్రించిన పాత ఫొటో ఉన్నా, దానికి పక్కనే తాజా కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటో తప్పనిసరిగా అతికించాలి. దీంతో ఓటరు వివరాలు తాజాగానే నమోదవుతాయి.

**ప్రస్తుత వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి:**
ఫారం చివరి భాగంలో పుట్టిన తేదీ, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు, తల్లి లేదా సంరక్షకుడి పేరు, వారి ఓటరు గుర్తింపు కార్డు నంబరు నమోదు చేయాలి. వివాహితులు జీవిత భాగస్వామి వివరాలు నమోదు చేయాలి. అవివాహితులు ఆ కాలమ్‌ను ఖాళీగా వదిలేయవచ్చు.

**ఈ పత్రాలు సిద్ధంగా ఉంచండి:**
ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం,10వ తరగతి సర్టిఫికెట్ ,పాస్‌పోర్ట్ (ఉంటే), శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటి అద్దె రసీదు లేదా విద్యుత్ బిల్లు వంటి చిరునామా ఆధారాలు

**చేయాల్సినవి:** ప్రతి కాలమ్‌ను పూర్తిగా చదివి జాగ్రత్తగా నింపాలి. పేరు, పుట్టిన తేదీ అన్ని పత్రాల్లో ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. తాజా మొబైల్ నంబరు, చిరునామా నమోదు చేయాలి. అవసరమైన అన్ని పత్రాలు జత చేయాలి. ఫారం సమర్పించిన వెంటనే రసీదు లేదా అంగీకార పత్రం తప్పనిసరిగా తీసుకోవాలి. సందేహాలు ఉంటే వెంటనే బీఎల్‌వోను సంప్రదించాలి.

**చేయకూడనివి:** తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఇవ్వకూడదు. ఫారంలోని కాలమ్‌లను ఖాళీగా వదిలేయకూడదు. ఇతరుల పత్రాలను ఉపయోగించకూడదు. పత్రాల్లో మార్పులు చేసి సమర్పించకూడదు. చదవకుండా సంతకం చేయకూడదు. ఒకే వ్యక్తికి భిన్నమైన వివరాలు నమోదు చేయకూడదు. ఓటు హక్కును కాపాడుకోవడం మన బాధ్యతే: ఎన్యుమరేషన్ ఫారం కేవలం ఓ దరఖాస్తు కాదు... భవిష్యత్తులో మీ ఓటు హక్కును భద్రపరిచే కీలక పత్రం.

## "వేతనాల పెంపు.. సంక్షేమ హామీల అమలుకు

# అంగన్వాడీల గళం"

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులు సిహెచ్ మాణిక్యాంబ, వై బేబీ రాణి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు ఎం సుందర్ బాబు, బి. పవన్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పి 11 ఏళ్ళు గడుస్తున్నా ఒక్క రూపాయి పెంచలేదని, రాష్ట్రంలో వేతనం పెంచి 7 సంవత్సరాలు గడుస్తుందని, ఈ కాలంలో నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, కరెంట్ బిల్లులు వందల రెట్లు పెంచారని విమర్శించారు. ఇచ్చే ఏడువేల జీవితంలో సెంటరు అద్దెల నిర్వహణకై పెట్టుబడులు పెట్టిడానికే సరిపోతుందన్నారు.



వంట కోసం ఇచ్చిన ఇండక్షన్ స్టవ్ వల్ల వచ్చే కరెంటుబిల్లు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఆయా పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో పని భారం మొత్తం టీచర్లపై పడుతుందన్నారు. తక్షణం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రమోషన్లకు 5 ఏళ్ల సర్వీస్ నిబంధనను తొలగించి స్థానిక ఆయాలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ పేరుతో గర్భిణీ స్త్రీలను, బాలింతలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయనీ, యుద్ధం సాకుతో పెంచిన ఇంధన ధరలు తగ్గించలేదని విమర్శించారు. ధర్నా అనంతరం డి ఆర్ ఓ కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ మూర్తి, కర్రి రామకృష్ణ, పూర్ణిమారాజు, భగత్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నమణి, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ లు మద్దతు తెలియ జేసారు. అంగన్వాడి జిల్లా నాయకులు అన్నపూర్ణ, మార్తా, రామలక్ష్మి, సూర్యకాంతం, కృష్ణవేణి , లక్ష్మీ , బ్రహ్మం , విజయకుమారి, మాలతి, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# తీపర్రులో 'మా గోదావరి సంకల్ప్'

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అదే విధంగా గోదావరి తీరంలో ప్రతి గ్రామంలో ఈ తరహా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షకు అనుగుణం గా తీపర్రు ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా ఎలా సిద్ధం చేయాలి, అలాగే నీరి అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత ప్రాంతంగా ఎలా మార్చాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా గ్రామ చెరువు పునరుద్ధరించడం, నీటి గుర్రపు డెక్క తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. గ్రామంలో ఫ్లెక్సీలు లేకుండా ప్లాస్టిక్ రహిత ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా యాత్రికులు, పర్యాటకులు తమ గోదావరి దర్శనాన్ని గుర్తుంచుకునేలా "ఐ లవ్ గోదావరి మా తీపర్రు" పేరుతో రెండు సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 25 హోమ్ స్టేలకు సన్నాహాలు చేస్తామన్నారు. అంతేగాక "తీపర్రు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ విలసిల్లేలా, స్థానిక పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేలా కార్యక్రమాలు చేపట్టనున్నాం. పర్యావరణ అనుకూల గోదావరి పుష్కరాలపై అవగాహన కల్పించేలా ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు, సూచనలతో ముందుకు వెళ్తాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. స్థానికంగా ఉన్న కాలువలో కయాకింగ్ తరహా అడ్వెంచరస్ స్పోర్ట్స్ ను ప్రవేశపెడతాం. ఘాట్ వెంబడి వీధి దీపాలు, హెరిటేజ్ స్ట్రీట్ లను అభివృద్ధి చేస్తాం. ఈ ఘాట్ ఎంపికలో స్థానిక గ్రామస్థుల నుంచి అద్భుతమైన మద్దతు, స్వచ్ఛంద సహకారం లభించాయి.

త్వరలోనే ఈ ఘాట్, విలేజ్‌కు సంబంధించిన ప్రత్యేక లోగో, స్లోగన్ స్థానిక చరిత్రను వెలికితీసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండటం వల్లే తొలి ప్రాధాన్యతగా తీపర్రు ఘాట్‌ను ఎంచుకున్నాం. దాతల సహకారంతో ఇక్కడ మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మిగిలిన ఘాట్లను కూడా అభివృద్ధి చేస్తాం. అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మా గోదావరి సంక్రాంతి 2027 పేరిట రానున్న జనవరి నాటికి తీపర్రు నమూనాతో ముక్కామల, ముక్తేశ్వరం, కుండలీశ్వరం, కొవ్వూరు తదితర గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయనున్నామన్నారు. అదే విధంగా తాము చేపట్టనున్న కార్యక్రమాలను 24 నవంబర్ న కార్తీక పౌర్ణమి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యవేక్షించనున్నారని, 2027 జనవరిలో సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించనున్నట్లు తెలిపారు. తీపర్రు ఘాట్ అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ చొరవ, సహకారం బాగుందని కొనియాడారు. 2014 నుండి తదేకం ఫౌండేషన్ తరపున సామాజిక సేవ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..2027 గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుష్కరాల నాటికి నిడదవోలు నియోజకవర్గంలోని పలు ఘాట్లను సుందరీకరించి, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా సకల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ క్రమంలో తీపర్రు ఘాట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన తదేకం ఫౌండేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అభినందించారు.



# యువత ఉజ్వల భవిష్యత్తు కోసమే జాబ్ మేళా

**పెద్దాపురం (మనసులో మాట) జూలై 10;**

నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తు కోసమే జాబ్ మేళా నిర్వహించినట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శుక్రవారం పెద్దాపురం మహారాణి కళాశాలలో వికాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు సారధ్యంలో ఏర్పాటుచేసిన జాబ్ మేళా ను ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో కార్పొరేట్ సంస్థల సహకారంతో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



టెక్ మహేంద్ర, యాక్సిస్ బ్యాంక్, హుండాయ్, ఇందుస్, తదితర కార్పొరేట్ సంస్థలో చే నిర్వహించిన జాబ్ మేళాలో 1449 ఉద్యోగాల కల్పన ఏర్పాటులు చేసినట్లు లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్సి నుండి బీటెక్, పిజి వరకు విద్యార్హతలు కలిగిన యువతకు 15,500 నుండి 40,000 వేలు జీతం లభించేలా ఉద్యోగ మేళాను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించటం, ఉద్యోగాల కల్పన వంటి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు ఎమ్మెల్సీ రాజశేఖర్ తెలిపారు. కూటమి నేతలు రాజా సూరిబాబు రాజు, సరోజ వాసు, బడుగు శ్రీకాంత్, అంటే జగదీష్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.





# సమాచార హక్కు చట్టంపై ప్రజా సమాచార అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి

- **రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ వి.ఎస్.కె. చక్రవర్తి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పట్ల ప్రభుత్వ కార్యాలయాల ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు) సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ వి.ఎస్.కె. చక్రవర్తి సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టం అమలు తీరును పరిశీలించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ దరఖాస్తులు, రిజిస్టర్లు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు 2005లో



సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రతి భారతీయ పౌరుడు ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల నుంచి నిర్ణీత గడువులోపు సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉంటారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో అర్జీదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పూర్తి స్థాయిలో అందించడం పీఐఓల బాధ్యత అని అన్నారు. ఒక దరఖాస్తు రెండో అప్పీలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది చట్టం అమలులో లోపం ఉన్నట్లుగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అందువల్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, చట్టం ప్రకారం 30 రోజులలోపు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు.ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా వ్యక్తిగత శత్రుత్వంతో సమాచారాన్ని కోరే వ్యక్తుల విషయంలో పీఐఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని వి ఎస్ కె చక్రవర్తి సూచించారు. అటువంటి చర్యల వల్ల నిజంగా సమాచారం అవసరమైన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ తరహా దుర్వినియోగంపై ఇటీవల రాష్ట్ర సమాచార కమిషన్ విచారణ నిర్వహించి, కొందరిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో, అందుకు గల చట్టబద్ధమైన కారణాలను స్పష్టంగా అర్జీదారునికి తెలియజేయాల్సిన బాధ్యత కూడా పీఐఓలపై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో కూడా ఆర్టీఐ సమాచార బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలని అధికారులను కమిషనర్ చక్రవర్తి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలు) పాల్గొన్నారు.

## వర్షా కాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు కారణమైన బ్యాక్టీరియా, వైరస్, జన్యువులు, జీవనశైలి వంటి వాటిపై అవగాహన పెంచుకొని తదనుగుణంగా ఆరోగ్య సంరక్షణ విధానాలను మార్చుకోవాలని పి ఎం పి వైద్యులు కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బ్యాక్టీరియా, వైరస్, జన్యుపరమైన మార్పులు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ,మానసిక ఒత్తిడి వంటి జీవన మార్పుల వలన వ్యాధులు వస్తాయి అని అన్నారు.



## అక్కడ కాపులకు సీఎం పదవి ఇచ్చి... ఇక్కడ చెప్పండి

- **చిన్నయ్య దొర**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిని కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్లో హామీలు ప్రకటించాలని మున్సిపల్ ఛాంబర్స్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, సామాజిక వేత్త గోరకపూడి చిన్నయ్య దొర అన్నారు. సామర్లకోటలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిన్నయ్య దొర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కాపులు మద్దతు ప్రకటిస్తే, సీఎం పదవిని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి, మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ప్రకటించడం పట్ల చెన్నయ్య దొర స్పందించారు.

గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు కాపులకు హామీ ఇచ్చి, ఆ తర్వాత మోసగించడం జరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ముందుగా అక్కడ ముఖ్యమంత్రి పదవిని కాపులకు అందించి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాపుల మద్దతును కాంగ్రెస్ పార్టీ కోరాలన్నారు. తెలంగాణలో కాపులకు ముఖ్యమంత్రి పరిధి ఇస్తే, ఆంధ్రప్రదేశ్లో కాపుల



మద్దతు కాంగ్రెస్ పార్టీకి లభిస్తుందని చిన్నయ్య దొర తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలవల్ల కాంగ్రెస్ పార్టీని కాపులు నమ్మే స్థితిలో లేరని చిన్నయ్య దొర తెలిపారు. కాపులకు నమ్మకం కలిగించేందుకు ముందుగా తెలంగాణలో ముఖ్యమంత్రి పదవిని కాపులకు ఇవ్వాలని, అప్పుడే కాంగ్రెస్ పట్ల కాపులకు నమ్మకం ఏర్పడుతుందని చిన్నయ్య దొర తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా కాపులకు ఒక నమ్మకం, భరోసా కల్పించాలని అప్పుడే చింతా మోహన్ ప్రకటన పట్ల కాపులకు నమ్మకం ఏర్పడుతుందని చిన్నయ్య దొర తెలిపారు.

## ముంచుకొస్తున్న గడువు

- **సర్ వేగం చేస్తూ సమయం పెంచాలి**

**కొత్తపేట( మనసులో మాట) జూలై 10**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గతనెల జూన్ 14 నుండి జరుగుచున్న ప్రక్రియ ఈనెల జూలై 14 తో ముగియనున్న నేపధ్యంలో కొత్తపేట నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాలు ప్రజలకు భూత్ లవారీ నూరుశాతం పంపిణీ జరిగిన ఎన్యూమరేషన్ పారాలు అధికారులు డిజిటలైజేషన్ ను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. ఇప్పటకీ ఇంకా నమోదుకాకుండా కొంతమంది ఇళ్లు మార్పులు ,అడ్రస్ మార్పులు,వలస వెళ్లినవారు,చనిపోయిన వారి వివరాలు సమాచారం తెలుసుకొని కేవలం ఐదురోజులు మాత్రమే గడువు ఉన్నది కనుక సర్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేసి నూరు శాతం అందరకీ ఓటు ఉండేలా అధికారులు వేగవంతం చేసి జిల్లాలో కొత్తపేట నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో ఉండేలా అదికారులు కృషిచేయాలని పాలూరి అధికారులను కోరారు.

మనసులో మాట

# బోటు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- తొండంగి బోటు అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తొండంగి మండలం పరిధిలో జరిగిన బోటు అగ్నిప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడి, కాకినాడ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావుతో కలిసి పరామర్శించారు. ప్రమాదంలో యేరిపల్లి కోటేశ్ (తండ్రి తాతీలు), యేరిపల్లి ప్రసాద్(తండ్రి గోపి) తీవ్రంగా గాయపడగా, దులం రామకృష్ణ (తండ్రి బండియ్య) మోస్తరు



గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులు, వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అడిగి తెలుసు కున్నారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో స్వయంగా చర్చించి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అవసరమైన మందులు వైద్య సదుపాయాలను సకాలంలో అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు.







# గొల్లపాలెం రక్షిత మంచినీటి చెరువు చేపల వేలంపాట వాయిదా

**కాజులూరు, (మనసులో మాట) జూలై 10**

గొల్లపాలెం రక్షిత మంచినీటి చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపల వేలంపాట శుక్రవారం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఈ విషయాన్ని కాకినాడ జిల్లా పరిషత్ రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు ప్రకటన మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించాల్సి ఉండగా, మొత్తం ఎనిమిది మంది డిపాజిట్ దారులు నిర్ణీత డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి, సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రాలతో హాజరయ్యారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూసినా వేలంపాట ప్రారంభం కాకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్‌ను ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే ముందుగానే డిపాజిట్ చెల్లించి, అవసరమైన పత్రాలన్నీ సమర్పించిన అనంతరం చివరి నిమిషంలో వేలంపాటను వాయిదా వేయడం నిబంధనలకు విరుద్ధమని డిపాజిట్ దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ జోక్యం ఉందని కొందరు డిపాజిట్ దారులు ఆరోపించారు. ఇప్పటికే వేలంపాటలో పాల్గొనేందుకు ఖర్చులు చేసి, సమయం వెచ్చించిన తమకు నష్టం జరిగిందని, సంబంధిత అధికారులు తక్షణమే కొత్త తేదీని ప్రకటించి పారదర్శకంగా వేలంపాట నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు త్వరితగతిన స్పష్టత ఇచ్చి, వేలంపాటకు కొత్త తేదీ ప్రకటించాలని డిపాజిట్ దారులు కోరుతున్నారు.

# జనన, మరణ ధృవీకరణకు సత్వర చర్యలు

**పెద్దాపురం, (మనసులో మాట) జూలై 10**

సామర్లకోట మున్సిపల్ పట్టణ పరిధిలో జనన మరణ ధ్రువీకరణకు సత్వర చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బోలి వారి వీధిలో గోలి సీతారామలక్ష్మి అనే మహిళ మృతి చెందినట్లు సమాచారం అందటంతో వెంటనే జనన మరణ సెక్షన్ ఏఎస్ఓ బిఆర్వి చౌదరి, హెల్త్ అసిస్టెంట్ ఎం సత్యనారాయణ డిజిటల్ అసిస్టెంట్ వై జయరాజు ఘటనా స్థలంలో విచారణ నిర్వహించి తక్షణమే మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడం జరిగిందన్నారు. స్థానిక సిఎస్ రత్నం రాజు ఆసుపత్రిలో జన్మించిన ఇద్దరు శిశువులకు కూడా తక్షణమే జనన ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ నిర్వహించి, ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. ప్రజలకు జనన మరణ ధ్రువీకరణ పత్రాలను సులభంగా తక్షణమే అందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని కమిషనర్ కనకారావు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# పెద్దాపురం పెద్దిరాజు చెరువులో మట్టి దొంగలు

- కోట్లాది రూపాయల మట్టి రవాణా.. ప్రేక్షక పాత్రలో అధికారులు

**పెద్దాపురం, (మనసులో మాట) జూలై 10**

పెద్దాపురం నుండి కట్టమూరు వెళ్లే పుంత రోడ్డు రహదారిలో ఉన్న పెద్దిరాజు చెరువులో మట్టి మాఫియా దొంగలు పడ్డారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగారాన్ని తలపించేలా జిల్లాలో మట్టికి భారీ డిమాండ్ నెలకొని ఉంది. పెద్దిరాజు చెరువులో పెద్ద ఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాతో దళారులు కోట్లాది రూపాయల అక్రమ మట్టి వ్యాపారాన్ని సాగిస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం సర్వత్ర అనుమానాలకు తావిస్తోంది. చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనే మూడు కోతుల కథను తలపిస్తూ



ఇరిగేషన్, గనుల శాఖ, రవాణా శాఖలు ప్రేక్షక పాత్ర వహించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన వచ్చును అంటూ ప్రజలు బాహటంగానే విమర్శిస్తున్నారు.

ప్రతినిత్యం వందల కొద్ది లారీలు ఈ రహదారిలో అక్రమ మట్టి రవాణాతో సైరా విహారం చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో



నని పాత పెద్దాపురం, కట్టమూరు పుంత రోడ్డు ప్రజలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా చెరువులో నూతులను తలపించేలా గోతులు ఏర్పడటంతో భారీ ప్రమాదం పొంచి ఉందని స్థానికులు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా వర్షం నీరు చెరువుకు చేరకుండా మట్టి వ్యాపారులు చేస్తున్నారని, తద్వారా చెరువు ఆయ కట్టు ప్రాంత పంట పొలాలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండ దండలతోనే మట్టి తవ్వకాలు,రవాణా సాగుతున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విజిలెన్స్ అధికారులు ఇప్పటికైనా మట్టి తవ్వకాలు, రవాణా, అధికారుల పాత్ర పై చర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గోదావరి వరదలు, అధిక వర్షాలపై ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలి



- జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం(మనసులోమాట**

రానున్న వర్షాకాలంలో గోదావరి నదికి వరదలు సంభవిస్తే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు మండలాల వారీగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి శాంతి కమిటీ సమావేశంతో పాటు, గోదావరి వరదలు అధిక వర్షాల సన్నద్ధత, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రగతి అంశాలపై అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండల డివిజన్ వారీగా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి ఉత్సవాలు నిర్వహణ విగ్రహాలు, బరియల్ గ్రౌండ్ ఏర్పాటులో ఎటువంటి వివాదాలు ఉత్పన్నం కాకుండా శాంతియుతంగా పోలీసు రెవెన్యూ ఆర్ అండ్ బి శాఖలు వ్యవ హరించాలని సూ చించారు జూలై నుండి అక్టోబర్ వరకు తుఫానులు, వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పటిష్టమైన వ్యూహంతో వ్యవహరించాలన్నారు. వరదల వల్ల పంట కాల్వలు, మురుగు కాల్వలు, చెరువులు, ఏర్లకు గండ్లు పడే అవ కాశం ఉన్న బలహీనమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి పటిష్టం చేయాలన్నారు గోదావరి నది మొదటి, రెండు, మూడు ప్రమాద హెచ్చరికల సమయంలో ముంపునకు గురయ్యే గ్రామాలు, జలదిగ్బంధంలో చిక్కుకునే రహదారులను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

ముంపు ప్రాంత గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది లేకుండా 3 నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరు కులను సిద్ధంగా ఉంచాలన్నారు. అత్యవసర రెస్క్యూ ఆప రేషన్ల కోసం జిల్లాకు ఒక ఎన్డీఆర్ఎఫ్ , ఒక ఎస్డీఆర్ఎఫ్ బృందం రాను న్నాయ న్నారు. స్థానికంగా బోట్లు, ఈత గాళ్లను ముందు గానే సిద్ధం చేసుకోవాలన్నారు. అవేర్' పోర్టల్ ద్వారా రాబోయే ఐదు రోజుల వాతావరణ పరిస్థి తులను నిరంతరం అధ్య యనం చేస్తూ తదనుగు ణంగా అప్రమత్తం కావాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లా డుతూ వరద సహాయక చర్యల్లో పో లీస్ యం త్రాంగం పూర్తిగా అప్రమ త్తంగా వ్యవహరిస్తుం దని, రెవెన్యూ విభాగంతో సమన్వయం చేసుకుంటూ సేవలందిస్తుందని స్పష్టం చేశారు.

**అనంతరం ఓటర్ల జాబితా :**

ప్రత్యేక సమగ్ర సవరణ పైజిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి మాట్లాడుతూజిల్లాలో 20,000 ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించాల్సి ఉండగా, ప్రస్తుతం డిజిటైజేషన్ ప్రక్రియ 82 శాతం పూర్తయిందని తెలిపారు. ప్రగతిలో వెనుకబడిన అధికారులు తమ పని తీరును మెరుగుపరు చుకోవాలని ఆదేశించారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను నిశితంగా పరిశీలించిన జేసీ.ఓటర్ల జాబితా సవరణలో ఇంటింటి సర్వేను విజయవంతంగా పూర్తి చేయడానికి వచ్చే మూడు రోజులు అత్యంత కీలకమని పేర్కొన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అను గుణంగా అత్యంత పారద ర్శకంగా, జవాబు దారీతనంతో ఈ ప్రక్రియ సాగుతోందని, ప్రతి నియో జక వర్గంలో ఓటర్ల సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా బీఎల్ఓ లకు ప్రత్యేక అధికా రులు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులు త్వరితగతిన అందజేయాలి

- తాహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశం

**కాజులూరు, (మనసులో మాట) జూలై 10**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మిగిలిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీలోపు తప్పనిసరిగా అందజేయాలని కాజులూరు తాహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ, శీల గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తాహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం మండలంలో ఇప్పటికే 85 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన 15 శాతం ఓటర్లు సుదూర ప్రాంతాల్లో ఉండటంతో వారికి కూడా దరఖాస్తులు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. అయితే, కొంతమంది నుంచి ఇప్పటికీ నింపిన ఎస్ఐఆర్ దరఖాస్తులు అందలేదని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను ధృవీకరించి, నింపిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీలోపు సంబంధిత బూత్ లెవల్ అధికారులు లేదా రెవెన్యూ సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్రజల సహకారంతో మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వీరబాబు, బూత్ లెవెల్ అధికారులు సూర్యనారాయణమూర్తి , శ్రావణి, కె పద్మ, నూక వరలక్ష్మి, అశోక్ , పద్మజ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జులై 15 వ తేదీ నుండి 24 వ తేది వరకు వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

- వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న వెల్లడి

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ రూరల్ కొవ్వూరులో వారాహి అమ్మవారి ప్రాంగణంలో గుప్త నవ రాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న శుక్రవారం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభం అవుతుందని కాశీ క్షేత్ర పరిపాలకురాలుగా అమ్మవారి కీర్తి ఎంతో ఉందన్నారు. భక్తులు సమస్యలు నుంచి త్వరితగతిన బయట పడేందుకు అమ్మవారిని ఉపాసనతో ప్రార్థించాలని, ఉదయం వేళల్లో అమ్మవారికి దీపారాధనలు చేసి రాత్రి వేళల్లో పూజిస్తే అనుకున్న పనులు జరుగుతాయని వివరించారు. అమ్మ వారికి పానకం, చక్రపొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పించాలన్నారు. అమ్మవారు భూదేవత అయినందున క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు, కాయ గూరలుతో పాటు భూమి నుంచి వచ్చే ఆహార పదార్థాలు అన్నీ ప్రసాదం రూపం లో పెట్టవచ్చన్నారు. తమ ప్రాంగణంలో నిర్విరామ అన్నదానం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మామూలు రోజులు కన్నా అమ్మవారిని ఆషాఢమాసంలో భక్తితో పూజించడం వలన కుటుంబం అంతటికీ అనుగ్రహం వేగంగా లభిస్తుందన్నారు. దీక్ష చేపట్టే వారు భూశయనం, బ్రహ్మచర్యం, ఒంటి పూట భోజనం, కాయగూరల భోజనం తిని నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేసారు. గుప్త నవరాత్రుల తర్వాత తాను విశ్రాంతి తీసుకుంటానని, ఆలయం స్థాపించి నప్పటి నుండి నిర్విరామంగా అమ్మవారికి సేవలు చేస్తున్నానని తమ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఇంటిలో పూజించే అమ్మవారిగా కొలిచామని లక్ష్మీ ప్రసన్న తెలిపారు. రాష్ట్రస్థాయిలో కొవ్వూరు అమ్మవారికి ఇంత ఆదరణ లభిస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్త కాళ్ళ సత్యనారాయణ తో పాటు అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## మాత శిశు మరణాలు సంభవించ కుండా రోటరీ ఆరోగ్య శిబిరాలు

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు రోటరీ ఇంటర్నేష నల్ మాతా శిశు ఆరోగ్య రక్షణ మాసోత్సవంలో భాగంగా యాంటినెటల్ కేర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం అని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ధరణి కన్స్ట్రక్షన్స్ అధినేత టి.వి. రమణారావు అన్నారు.కాకినాడ పర్లవపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో యాంటినెటల్ కేర్ క్యాంప్ నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ మజ్జద్ హుస్సేన్ అధ్యక్షత వహించగా రోటరీ అసిసెంట్ గవర్నర్ టి.వి.రమణరావు ముఖ్యఅతిధిగా పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ను ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ప్రముఖ స్త్రీల వైద్యనిపుణురాలు డా.ఎ.ఎల్. సత్యవతి సారధ్యం లో గైనకాలజిస్టు డా. సుష్మా, డా.విజేత, డా. కృష్ణవేణి, డా. నాగలక్ష్మి, డా.సరోజని లు పాల్గొని క్యాంపు వచ్చిన 127 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈసందర్భంగా అసిసెంట్ గవర్నర్ టి.వి. రమణరావు మాట్లాడుతూ కాకినాడ నగరంలో రోటరీక్లబ్ మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తోందని వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇప్పటికే బాలికల ఆరోగ్య అంశంపై రోటరీ క్లబ్ కాకినాడ మహేష్ బాబు ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని ఆయన గుర్తు చేశారు . మహిళఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని రమణా రావు అన్నారు .అందుకే రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని వివరించారు. పర్లోపేట వంటి ప్రాంతంలో రోటరీ క్లబ్ కాకినాడ మాత శిశు సంరక్షణ కోసం ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు . మహిళా వైద్యానికి సంబంధించిన డా.ఎ.ఎల్.సత్యవతి మాట్లాడుతూ మాతృ మరణాలను తగ్గించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అడిషినల్ డి.ఎం. అండ్ హెచ్.ఒ. డా.సుబ్బరాజు మాట్లాడుతూ రోటరీ క్లబ్ యాంటినెటల్ క్యాంప్ నిర్వహించినందుకు వైద్య ఆరోగ్యశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కాకినాడ కార్యదర్శి మణికంఠ పాస్ట్ ప్రెసిడెంట్ తడాల బుజ్జి, ఎక్సెల్ రమేష్, అండాళ్, గమిని కాశీ విశ్వనాథ్, అహ్మద్, ఇంజనీర్ వేమూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# రూ.105 కోట్లతో కాకినాడ స్మార్ట్ సిటీ పనులకు ఊపిరి

- **నిలిచిపోయిన ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తి చేస్తాం**
- **ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో గత కొంత కాలంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.105 కోట్లు విడుదల చేయడం నగరాభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శుక్రవారం అన్నారు.ఆర్థిక పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ కాకినాడ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి నగర ప్రజల తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సినిమా రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కాకినాడ నగర పాలక సంస్థ నూతన కార్యాలయ భవనాన్ని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొండబాబు పరిశీలించారు. అనంతరం ఆయన



మీడియాతో మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రారంభమైన సమయం లో నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.నగరపాలక సంస్థకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కార్పొరేషన్ భవనం నిర్మించడం, అన్ని పరిపాలనా కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం, దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అనేక ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను రూపొందించామని ఆయన చెప్పారు.

అయితే ప్రభుత్వం మారిన తర్వాత గత ఐదేళ్లలో స్మార్ట్ సిటీ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించక పోవడంతో అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచి పోయాయని విమర్శించారు. కార్పొరేషన్ నూతన భవనంతో పాటు ఇతర స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు కూడా అసంపూర్తిగా మిగిలి పోయాయని తెలిపారు.కాకినాడ నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త వాటర్ స్కీమ్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో జాతీయ రహదారి 216ను అనుసంధానించే మూడో వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదించి, దానికి అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.

మోడల్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం, జన్మభూమి స్టేడియం అభివృద్ధి వంటి పలు కీలక ప్రాజెక్టులు కూడా గత ప్రభుత్వ హయాంలో నిలిచి పోయాయని ఆయన అన్నారు.ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలోని అసంపూర్తి పనులను పూర్తి



చేసేందుకు రూ.105 కోట్లు విడుదల చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో కార్పొరేషన్ భవనం సహా వివిధ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ భవనాన్ని కమిషనర్‌తో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్న ఆయన, అవసరమైన సాంకేతిక మార్పులు, చేర్పులు చేసి నాణ్యతతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. మూడో వంతెన నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి కాకినాడను ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. వెంకట్రావు, డి ఈ ఆదినారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మణికంత, మచ్చరాజు, సి.వి.ఎ.పి బృంద సభ్యులు మేచినేని దివ్య రాణి , బండారు జ్యోతి సుష్మ, వడ్డి సూర్య కుమారి,నంబారు సాయి పూజ‌సంబంధిత కాంట్రాక్టర్ సుధాకర్, స్మార్ట్ సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బి.ఇడి ఆన్లైన్ మోడరేషన్ ను ప్రారంభించిన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ

**రాజానగరం (మనసులో మాట) జూలై 10**

తెలుగు రాష్ట్రాలలో మొట్ట మొదటిసారిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లో బి.ఇడి ఆన్లైన్ మోడరేషన్ బోర్డు విధానాన్ని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ ప్రారంభించారు.శుక్రవారం యూనివర్సిటీలో బి.ఇడి కళాశాలలకు ఆన్లైన్ మోడరేషన్ బోర్డును ప్రారంభించి వివరాలు తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణలో అతి కీలకమైన ప్రాజెక్ట్స్, రికార్డ్స్, యాక్టివిటీస్ మోడరేషన్ ప్రక్రియను ఆన్లైన్ విధానంతో ఆధునికరించామని అన్నారు. రాష్ట్రంలో ఏ విశ్వవిద్యాలయంలోను లేని విధంగా జిపిఎస్, ఫేస్ రికగ్నిషన్ వంటి నూతన సాంకేతిక పద్ధతులతో ఆన్లైన్ మోడరేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టామన్నారు. దీని ద్వారా ప్రతి బి.ఇడి కళాశాలలో ఉన్నత శిక్షణ ఇవ్వచ్చు అని, ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు అందుబాటులో ఉంటారని, శిక్షణలో ఉన్న ఉపాధ్యాయ విద్యార్థులు కళాశాలకు నిత్యం హాజరవుతారని చెప్పారు . రికార్డ్స్ అన్నీ కూడా ఆన్లైన్ ద్వారా పేపర్ లెస్ విధానంలో ఉంటాయని, దీని ద్వారా పారదర్శకంగా మోడరేషన్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ఆయా కళాశాలల అధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు నిర్వహించి సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. బి ఓ ఎస్ చైర్మన్ బీ.ఇడీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. సుబ్బారావు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 40 బిఇడి కళాశాలలకు గత నెల రోజుల నుండి అవగాహన కల్పించామని, విద్యార్థులు వ్రాసిన ప్రాజెక్టులను ఆన్లైన్ ద్వారా సబ్మిట్ చేస్తారని, మూల్యాంకనం కూడా ఆన్లైన్ లోనే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎగ్జామినేషన్స్ డా.టి. హైమావతి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

- **పుష్కర్ నగర్లు, పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించిన జిల్లా యంత్రాంగం**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**



తూర్పుగోదావరి జిల్లాలో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్తో పాటు వివిధ శాఖల అధికారులు శుక్రవారం రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పర్యటనలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, తాత్కాలిక వసతి, హోల్డింగ్ ఏరియాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్, జీఎస్ఎల్ వెనుక ప్రాంతం, దేవాన్ చెరువు జీరో పాయింట్, కేశవ హాస్పిటల్ రోడ్, గమన్ వంతెన కాతేరు అండర్‌పాస్ ప్రాంతం, కాతేరు లోని సీటీఆర్ఐ భూములు, వ్యవసాయ కళాశాల సమీప ప్రాంతం, తిరుమల బస్ గ్రౌండ్, తిరుమల పాపయ్య నగర్ సమీప ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. అనంతరం కొవ్వూరు చేరుకుని అక్కడ నుంచి తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు.



ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పార్కింగ్, హోల్డింగ్ ఏరియాలు, పుష్కర్ నగర్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను సమీక్షించారు. అలాగే ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఉదయం 7 గంటల నుంచి రాజమహేంద్రవరం లోని పుష్కర్ ఘాట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలి

- **జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి**

**అమలాపురం(మనసులోమాట) జూలై 10:**

రూ. 1,650 కోట్లతో గోదావరి సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు నిర్దేశిత గడువు 2027 ఏప్రిల్ నాటికి జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా త్రాగు నీటి సరఫరా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి సంబంధిత శాఖల ఇంజనీర్లు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జల జీవన్ మిషన్ కింద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా పైప్ లైన్ ద్వారా సురక్షిత త్రాగునీరు ప్రతి పాదించిన వాటర్ గ్రిడ్ పథక నిర్మాణ పనులుఇప్పటి వరకు 25 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాటర్ గ్రిడ్ నిర్మాణ పనుల స్థితిగతులను సంబంధిత మెగా ఇంజనీరింగ్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జల వనరుల శాఖలు ఇంజనీర్లు పైప్ లైన్ ఏర్పాటులో రోడ్లు వెంబడి కాలువలలో పైప్లైన్ ఏర్పాట్లు పూర్తిగా సహకరించాలని కోరారు. అదేవిధంగా రోడ్డు కటింగ్ లు వంటి అంశాలను పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వివిధ రకాల అనుమతులు



ఎప్పటికప్పుడు తీసుకుని నిర్మాణ పనులను నిర్దేశిత గడువు లోపల పూర్తి చేయాల న్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ పైప్లైన్ ద్వారా సురక్షిత త్రాగునీరు సరఫరా చేసేందుకు ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన రూ. 1,650 కోట్ల గోదావరి సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్' పథకం నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని వైఖోమ్ నిధియా దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ మెగా త్రాగు నీటి ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ పైప్లైన్ల ద్వారా స్వచ్ఛమైన త్రాగు నీరు అందుతుందని తెలిపారు. కాలువలు, ప్రధాన రహదారుల వెంబడి పైప్లైన్లు ఏర్పాటు చేసే ప్రక్రియలో వివిధ శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని స్పష్టం చేశారు. ఆయా శాఖల నుంచి రావలసిన అనుమతుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఎక్కడా పనులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు.

రాబోయే కాలంలో పనుల వేగాన్ని రెట్టింపు చేయాలని కాంట్రాక్ట్ సంస్థలను, పర్యవేక్షక అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి, జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా త్రాగు నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయి లో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా పరమైన సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పనులను పరుగులు పెట్టించాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 27 క్లస్టర్లు లతో జిల్లావ్యాప్తంగా సురక్షిత త్రాగునీరు సరఫరా అవుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న మేజర్ అనుమతులను వెంటనే పొందాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డ బ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రాజన్, డి ఈ పద్మనాభం, రవీంద్ర, పంచాయతీరాజ్ ఎస్సీ పి రామకృష్ణా రెడ్డి, జల వనరుల శాఖ కార్య నిర్వాహక ఇంజనీర్ కె వెంకటేశ్వరరావు, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు ఆయా శాఖల ఈఈలు, డీఈలు, ఇతర ఉన్నతాధికారులు మరి యు ప్రాజెక్టు నిర్వహణ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించిన

- **డి.సి.హెచ్.ఎస్.కే. మహేశ్వరరావు**

**ఏలేశ్వరం (మనసులో మాట) జూలై 10**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లోని ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో డి సి హెచ్ ఎస్(డిస్టిక్ కంట్రోల్ ఆఫ్ హాస్పటల్ సర్వీస్) కె. మహేశ్వరరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి లో ప్రధాన వైద్యులు వి. రమేష్ తో కలిసి వివిధ వార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా 100 పడకల ఆసుపత్రిగా త్వరలోనే రూపాంతరం చెందుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చిన వివిధ రోగులతో కూడా ఆయన మాట్లాడారు. రోగులుకు అందిస్తున్న వైద్య సదుపాయాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రికార్డులను పరిశీలించారు. డి సి హెచ్ ఎస్ మహేశ్వర రావు వైద్యులకు తగు సూచనలు సలహాలు చేశారు . ఈ కార్యక్రమం లో వైద్యులు లావణ్య, సుప్రియ, నవీన్ కుమార్, ఆర్ రాధాకుమారి, సౌమ్య, పరిమళ కుమారి, సానిటరీ ఇన్స్పెక్టర్ బి. చక్రవర్తి, ల్యాబ్ టెక్నీషియన్ జై. త్రిమూర్తులు, రేడియోగ్రాఫర్ ఎం. రాజేష్, ఎం. ఎన్. ఓ.పి అచ్చారావు సిబ్బంది ఉన్నారు.






# సెయింట్ థామస్ విద్యార్థులకు ఎన్సిసి సర్టిఫికెట్లు పంపిణీ

**నూజివీడు (మనసులో మాట) జులై 10:**

నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హై స్కూల్ లో విద్యార్థులకు శుక్రవారం ఎన్సిసి ఏ సర్టిఫికెట్లు అందించారు. ఎనిమిదవ ఆంధ్ర స్క్వాడ్రన్ కమాండింగ్ గ్రూప్ కెప్టెన్ కె వి శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫ్లైట్ లెఫ్టినెంట్ సూరజ్ సింగ్ లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, బాధ్యత, సేవా భావంతో ముందడుగులు వేస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ మర్రెడ్డి, బ్రదర్ దేవస్య, బ్రదర్ జార్జి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# సైబర్ భద్రత – నా భద్రత నినాదం

- **జగ్గంపేటలో అవగాహన కార్యక్రమం**
- **పాల్గొన్న ఐసిడిఎస్ సిడిపిఓ పూర్ణిమ**

**జగ్గంపేట (మనసులో మాట) జులై 10 :**

జగ్గంపేట మండలం మన్యం వారి పాలెం హైస్కూల్లో జులై మొదటి వారం సందర్భంగా సైబర్ భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి సీడీపీఓ పూర్ణిమ, డీసీపీఓ వెంకట్రావు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ, నేడు మొబైల్ ఫోన్ విలాసం కాదు, అవసరం అయిందని,అదే సమయంలో మోసగాళ్లు మొబైల్ ద్వారా బ్యాంకు ఖాతాలలోకి, వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ లావాదేవీలు చేయడం చాలా మందికి తెలుసు, కానీ సురక్షితంగా చేయడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఒక చిన్న అవగాహన ఒక కుటుంబ పొదుపును కాపాడుతుందని ఒక సరైన సమాచారం యువతిని ఆన్లైన్ వేధింపుల నుండి రక్షిస్తుందని ఒక జాగ్రత్త వృద్ధులను



మోసాల నుండి కాపాడుతుందని తెలిపారు. ఈ వారం అంతా "సైబర్ భద్రత - నా భద్రత" అనే సంకల్పంతో ప్రతి విద్యార్థి కనీసం ఇరవై ఐదు కుటుంబాలకు ఈ సందేశం తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ, కార్యక్రమం పూర్తి చేయడం లక్ష్యం కాదని, నిజమైన అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు. విద్యార్థులు తప్పకుండా గుర్తుంచుకోవాల్సిన పది అంశాలను వివరించారు:ఓటీపీని ఎవరికీ చెప్పవద్దు.క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డబ్బు రాదు, చాలా సార్లు డబ్బు పోతుంది.సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు.బలమైన సంకేత పదం వాడాలి.పిల్లల మొబైల్ వాడకాన్ని తల్లిదండ్రులు గమనించాలి.ఆన్లైన్ వేధింపులు జరిగితే వెంటనే పెద్దలకు చెప్పాలి. మోసానికి గురైతే వెంటనే 1930 సహాయ కేంద్రానికి ఫోన్ చేయాలి. అనుమానాస్పద ఘటనలను సైబర్ నేర పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.మన చేతిలో ఉన్న మొబైల్ అభివృద్ధికి సాధనం కావాలి, మోసాలకు కారణం కాకూడదు" అని ఆమె అన్నారు.అవగాహన నేర్చుకుందాం ఇతరులకు నేర్పుదాం సైబర్ నేరాలను అరికడదాం అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమ్మాజీ, పీఓ ఎన్‌ఐసీ విజయ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీతానగరంలో నూరు శాతం ఓటర్ నమోదు

**జగ్గంపేట,(మనసులో మాట) జూలై 10:**

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ఆ ఓటు విలువను గుర్తించి జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలోని బూత్ నెంబర్ 167 లో ఎస్ ఐ అర్ ఓటర్ నమోదు ప్రక్రియను రికార్డు సమయంలో పూర్తి చేశారు.బూత్ లో మొత్తం 1006 ఓట్లు ఉండగా, అందులో 1004 ఓట్ల నమోదు పూర్తి చేసి నూటికి నూరు శాతం లక్ష్యానికి దగ్గరగా చేరుకున్నారు.గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, పిండి రెడ్డమ్మ, గారపాటి శ్రీనివాస్, సింగం శివ బృందం ఈ ఘనత సాధించారు.ఈ విషయం తెలుసుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బృంద సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ,ఓటు అనేది హక్కు మాత్రమే కాదు, బాధ్యతని,ఒకే ఒక్క ఓటు ప్రభుత్వాలను మారుస్తుందని భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎస్ ఐ అర్ ప్రక్రియకు ఇంకా 4 రోజులు సమయం ఉండగానే దాదాపు 100% నమోదు పూర్తి చేయడం సీతానగరం ప్రజల చైతన్యానికి నిదర్శనం అని అన్నారు.ఈ కృషిలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు.



# సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన పెంపు ఉండాలి



**నూజివీడు (మనసులో మాట) జులై 10:**

నూజివీడు పట్టణంలోని కోనేరు పేటలో గల టిటిడి కళ్యాణమండపం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్పి కే వివి ఎన్ వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధానంగా సైబర్ నేరాలు, నూతన చట్టాలపై ప్రజలలో అవగాహన పెంపొందాలని సూచించారు. వయస్సు మళ్ళిన పెద్దలు ఏటీఎం కార్డు వినియోగించడంలో అయోమయానికి గురి అయిన సందర్భంలో పొంచి ఉన్న కేటుగాళ్లు నగదు కాజేస్తుంటారని సోదాహరణంగా తెలిపారు. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిందని, ఫోను వినియోగం లో జాగ్రత్త వహించకపోతే బ్యాంకు ఖాతాలు ఖాళీ కావడం ఖాయం అంటూ హెచ్చరించారు. మనకు తెలియని లింకులు, ఏవో గొప్ప గొప్ప అవకాశాలు పేరుతో యువతను, పెద్దలను సైతం వలవేసి ఉచ్చులోకి సైబర్ నేరగాళ్లు లాగుతున్నారు తస్మాత్ జాగ్రత్త అన్నారు. కొన్ని సందర్భాలలో ఇతర రాష్ట్రాల నుండి మనకు తెలియని నంబర్లతో ఫోన్లు చేసి బెదిరించి, లక్షల రూపాయలలో కాజేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఓటిపిలు, పిన్ నంబర్లు బహిర్గతం చేయవద్దన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కొత్త టెక్నాలజీ ప్రవేశించిన తరువాత, ఈ టెక్నాలజీని మంచి కోసం వినియోగిస్తే అందరూ హర్షిస్తారు అన్నారు. డబ్బులు కాల్ చేసేందుకు, బాలికలు, మహిళలను మోసగించేందుకు అగంతకులు అనేక కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఎలాంటి అనుమానాలు వచ్చినప్పటికీ 112 నంబర్ కు తక్షణమే ఫోన్ సమాచారం అందించాలన్నారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం ఎల్లవేళలా శక్తి యాప్ రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. ప్రతి బాలిక, ప్రతి మహిళ వారి వారి ఫోన్లలో శక్తి యాప్ ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. మన ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకోవడం ద్వారా సమాజంలో సమున్నతంగా, సగౌరవంగా జీవించేందుకు క్రమశిక్షణతో ముందడుగు వేయాలన్నారు. మనం చేసే తప్పులు, నేరాలు ఎవ్వరికి తెలియదు అనే అపోహ నుండి బయటకు రావాలని, ఎట్టి పరిస్థితుల లోనూ నేరం చేసిన వారిని చట్టం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులు పట్టణ ఎస్సై కే నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మున్షి, కొంపెల్ల కృష్ణకుమారి, పోలీసు సిబ్బంది, శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు, స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.






# చర్చ్ మందిర ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అమలాపురం( మనసులోమాట) జూలై 10:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, సిరిపల్లి గ్రామంలో నిర్వహించిన యేసుపాదం ఫౌండేషన్ చర్చ్ మందిర ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం పి. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రార్థనా మందిరం ప్రజలకు ఆధ్యాత్మిక సేవలకు కేంద్రంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, క్రైస్తవ సోదర సోదరీమణులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, చర్చ్ నిర్వాహకులు, క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ఓటర్ల ధ్రువీకరణ

**నూజివీడు (మనసులో మాట) జులై 10:**

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) పై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. నూజివీడు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల ధ్రువీకరణ కొనసాగుతుందన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరం అన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ) క్షేత్రస్థాయి లో నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలనకు రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) సమన్వయంతో సహకరించాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న గైర్హాజరైన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన ఓటర్ల వివరాలను నిబంధనలను మేరకు ధృవీకరించేందుకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారులు, మండల తహశీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.






# మిషన్ హరితోదయం పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

**ఏలేశ్వరం( మనసులో మాట) జూలై 10**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లోని ఏలేశ్వరం లో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ హరితోదయం నినాదం తో ఏలేశ్వరం పట్టణంలో సుమారు 200 మంది విద్యార్థులతో భారీ పర్యావరణ అవగాహన ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది.ఈ ర్యాలీలో విద్యార్థులు మొక్కలు నాటుదాం ప్రకృతిని కాపాడుదాం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి, నీటిని ఆదా చేయండి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం వంటి సందేశాలతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజినల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ , ప్రిన్సిపాల్ టి. వి. వి.రమణ ఉపాధ్యాయ బృందం, సిబ్బంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు.



# కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థలో ఘనంగా జాతీయ మత్స్య రైతు దినోత్సవం

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ ఎస్ ఐ ఎఫ్ టి (షిఫ్ట్ ) నందు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపల్ ఎస్ఐఎఫ్టీ కాకినాడ, డాక్టర్. ఎస్. అంజలి , జిల్లా మత్స్యశాఖ అధికారి వి .కృష్ణారావు ఆఫ్కాఫ్ వైస్ చైర్మన్.బలసాడి రంగారావు ,అప్సడా డైరెక్టర్ కొండ బాబు హాజరయ్యారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణ రావు మాట్లాడుతూ జాతీయ మత్స్య రైతు దినోత్సవం జరుపుకోవడానికి గల ముఖ్య కారణాలను తెలిపారు. ప్రేరేపిత ప్రజననము యొక్క ప్రయోగాలను వివరించి దేశంలో ఆహార భద్రత పెంపొందించడానికి ప్రోటీన్ అవసరతలను పెంపొందించడానికి చేపలను విరివిగా ఉత్పత్తి చేసే సాంకేతిక పద్ధతులను అభివృద్ధి పరిచిన డాక్టర్ హీరాలాల్ చౌదరి సేవలను కొనియాడుచూ జాతీయ మత్స్య దినోత్సవం గల కారణాలను తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపల్ ఎస్ ఐ ఎఫ్ టి, డాక్టర్.ఎస్.అంజలి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్యశాఖ అమలు చేయుచున్న వివిధ పథకాలను సద్వినియోగపరుచుకుని ఆక్వా రైతులు మత్స్యకారులు ఆర్థిక ప్రకృతిని సాధించాలని తద్వారా దేశంలో మన రాష్ట్ర సుస్థిర ఆర్థిక అభివృద్ధికి మన రాష్ట్రంలో మత్స్యశాఖ ద్వారా జరుగుతున్న కృషిని వివరించారు. అదేవిధంగా జాతీయ మత్య రైతు దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను ప్రేరేపిత ప్రజమనము ద్వారా డాక్టర్ హీరాలాల్ చౌదరి అల్కొని వంటి శాస్త్రవేత్తలు యొక్క కృషిని కొనియాడారు.



# ధర్మవరంలో ప్రజా దర్బార్ నిర్వహించిన
# ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**ప్రత్తిపాడు (మనసులో మాట) జూలై 10**






కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం ప్రత్తిపాడు మండల ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించచారు. ఈ సందర్భంగా ప్రతిపండి నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలను శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా దృష్టికి తీసుకుని వచ్చారు .ఈ ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం లోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, తమ సమస్యలు, ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం తో ఆమె స్పందించు వారి వారి సమస్యలు పరిష్కారానికి తాను కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు .బాధితులు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో అందజేయగా, ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి అధిక శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని కొన్ని సమస్యల విషయంలో కూడా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు . ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేసారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# ఏఐబీయూజీ సభ్యునిగా రమణారావు

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూలై 10:**



అ ఖి ల భా ర త సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలోని అఖిల భారత ఇంజనీరింగ్ & సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి సభ్యునిగా (ఏఐబీయూజీ) తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ఇన్చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ. రమణారావు నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి అధికారులకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన ఈ బాధ్యతను గౌరవంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ఆయనను ఏపీ నిట్ అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# ప్రజాభిప్రాయ సేకరణసభ అస్సాగో పరిశ్రమలో కాకుండా గుమ్మలదొడ్డి గ్రామంలో నిర్వహించాలి

- **జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్**

**గోకవరం (మనసులో మాట) జూలై 10:**

గోకవరం మండలం గుమ్మల దొడ్డి గ్రామంలో నిర్మాణం చేసిన ప్రాణాంతకమైన కాలుష్యకారక అస్సాగో ఇథల్ ఆల్కహాల్ పరిశ్రమ ప్రతిరోజు రెండు లక్షల నుండి మూడు లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచుకునే దానికి ప్రజాభిప్రాయ సేకరణ సభను అసాగో పరిశ్రమ ఆవరణలో కాకుండా గుమ్మల దొడ్డి గ్రామం నడిబొడ్డున జరిపించాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివగణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక గోకవరం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శివ గణేష్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన, కాలుష్యకారక అస్సాగో పరిశ్రమ వల్ల వారి ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాత్రం కాలుష్యకారక పరిశ్రమ యాజమాన్యానికి అండగా ఉండి పరిశ్రమ నిర్వహణను నిరాటంకంగా జరిపిస్తూ ప్రజలకు నరక యాతన చూపిస్తున్నారని, ప్రజలకు అండగా ఉండవలసిన ఎమ్మెల్యే ప్రాణాంతకమైన పరిశ్రమ యాజమాన్యానికి అండగా నిలబడ్డారని జగ్గంపేట ఎమ్మెల్యే ను శివ గణేష్ ఎద్దేవా చేశారు.

గుమ్మలదొడ్డి, అచ్యుతాపురం, బాబాజీ పేట, వెదురుపాక గ్రామాలకు స్థానిక జగ్గంపేట ఎమ్మెల్యే ఏ అధికారిక కార్యక్రమానికి కానీ, మరే ఇతర కార్యక్రమాలు కానీ హాజరు కావడానికి భయపడుతున్నారని, అస్సాగో పరిశ్రమ పట్ల ఆ ప్రాంత ప్రజలు నిలదీస్తారని భయపడి ఆ ప్రాంతానికి శాసనసభ్యుడు వెళ్ళడానికి భయపడుతున్నారని శివ గణేష్ దుయ్య భట్టారు.ప్రాణాంతకమైన అసాగో పరిశ్రమ గుమ్మల దొడ్డి గ్రామం నుండి తరలించుకుపోయే వరకు కాంగ్రెస్ పార్టీగా ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటామని శివ గణేష్ భరోసా ఇచ్చారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసిల్దార్ తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ పై ప్రచారం చేయవలసిన అవసరం ఉందని, ప్రజాభిప్రాయ సేకరణ రోజు పోలీస్ ఆంక్షలు లేకుండా ప్రజలందరూ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ సంరక్షణ కార్యకర్తలు తదితరులు పాల్గొనే విధంగానూ,ఆయా బాధిత గ్రామాల ప్రజలు వారి వారి అభ్యంతర, నిరాభ్యంతర నిర్ణయాలను తెలియజేసే దానికి అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మీడియా ముఖంగా శివ గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నక్క సత్యనారాయణ, గోకవరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రాల రత్నాజీరావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ గొంప కొండబాబు యాదవ్, బ్లాక్ టు అధ్యక్షుడు బొల్లం బాపిరాజు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బదిరెడ్డి ప్రసాద్, జగ్గంపేట నియోజకవర్గం రైతు కాంగ్రెస్ అధ్యక్షుడు కోలపర్తి వీర వెంకటరమణ, జిల్లా కాంగ్రెస్ సభ్యుడు మాసారపు అప్పారావు, గోకవరం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏగుపాటి మహేష్ బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా బాధిత గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు

- **జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్రపై సెమినార్**

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 10:**

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జగ్గంపేట నగర శాఖ ఆధ్వర్యంలో "జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్ర" అనే అంశంపై సెమినార్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏబీవీపీ పూర్వ కార్యకర్త, ప్రస్తుతం మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల పూజా అనూష మాట్లాడుతూ, ఏబీవీపీ ఆవిర్భావం, చరిత్ర, లక్ష్యాలు, భావజాలం, అలాగే ఏబీవీపీతో తన విద్యార్థి దశలోని అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలు. జాతీయ పునర్నిర్మాణం అనేది కేవలం భవనాలు, రహదారులు నిర్మించడం మాత్రమే కాదని, దేశంలో విలువలు, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు కలిగిన పౌరులను తీర్చిదిద్దడం కూడా జాతీయ పునర్నిర్మాణంలో భాగమే అని అన్నారు.విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా సమాజ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని,సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, అవగాహన కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి, విద్యా సేవ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. అలాగే, ఏబీవీపీ స్థాపన నుంచి విద్యార్థుల్లో జాతీయ చైతన్యం, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమాజానికి సేవ చేసే అనేక మంది నాయకులను అందించిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థి జీవితం వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజం, దేశం పట్ల బాధ్యతను పెంపొందించుకునే స్వర్ణయుగమని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. .ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జగ్గంపేట భాగ్ కన్వీనర్ జశ్వంత్, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





మనసులో మాట

# తుని గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులు

- పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి
- సౌత్ కోస్ట్ రైల్వే జియం కు లేఖ రాసిన
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**



కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని, గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను తక్షణమే పునరుద్ధరించాలని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌ను లేఖ రాశారు. తుని, పరిసర ప్రాంతాల ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం లోకమాన్య తిలక్ టెర్మినల్ (ముంబై) ఎల్‌టిటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తుని రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మకం గా హాల్ట్ మంజూరు చేసినప్పటికీ, ఇప్పటి వరకు అమలు చేయలేదని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

తుని ఏ గ్రేడ్ రైల్వే స్టేషన్గా ఉండి, సంవత్సరానికి సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరుస్తోందని, తుని, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాలతో పాటు వందకు పైగా గ్రామాల ప్రజలు ఈ స్టేషన్‌పై ఆధారపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా హెటెరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్, డివీస్ ల్యాబొరేటరీస్, ఆరోబిందో ఫార్మా వంటి పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ తల్లి ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఈ హాల్టులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు . ఇప్పటికే ఆమోదం పొందిన హాల్టులను త్వరితగతన పునరుద్ధరించాలని కోరారు.అదేవిధంగా గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో సింహాద్రి ఎక్స్‌ప్రెస్, బొకారో ఎక్స్‌ప్రెస్ హాల్టులను పునరుద్ధరించాలని, విజయవాడ విశాఖపట్నం ప్యాసింజర్ రైలు సేవను తిరిగి ప్రారంభించాలని, ప్రయాణికుల డిమాండ్ మేరకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు గొల్లప్రోలులో హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రస్తుతం గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న యార్డ్ రీమోడలింగ్ పనుల్లో అవసరమైన ప్లాట్‌ఫాం విస్తరణ పనులను కూడా చేర్చి పూర్తి చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తన లేఖలో రైల్వే అధికారులను కోరారు

# రూ.1.60 కోట్లతో తణుకులో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

**తణుకు (మనసులో మాట), జూలై 10:**



తణుకు పట్టణంలోని 3, 4 వార్డుల ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 7.25 కిలోమీటర్ల పొడవైన డ్రెయిన్ల నిర్మాణ పనులకు తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

వర్షాకాలంలో డ్రెయిన్లు సరిగా లేకపోవడంతో నీరు నిల్వ ఉండటం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న డ్రెయిన్ల ద్వారా వర్షపు నీరు వేగంగా వెళ్లిపోవడంతో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

ఈ పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని, దోమల వ్యాప్తి తగ్గడంతో పాటు సీజనల్ వ్యాధులను కూడా నియంత్రించేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే చెప్పారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజల సౌకర్యాల దృష్ట్యా పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

తణుకు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుద్ధ్య రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొమ్మేటి వెంకట సుధాకర్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి తమరాపు రమణమ్మ తమరాపు సత్యానారాయణ ,గుబ్బల శ్రీనివాస్ ,

స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా దర్బార్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు అన్నారు . శుక్రవారం నాడు శాసనస భ్యుడు వారి క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను కొండబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటు లో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు నుండి వచ్చిన సమస్యల అర్జీలను పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు .ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లీపూడి వీరు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు



# వాడపల్లి వెంకన్న ఆలయ నిత్యన్నదాన పథకానికి రూ లక్ష విరాళం



**కొత్తపేట (మనసులో మాట ) జూలై 10**

ఏడు శనివారాల వెంకన్నగా పేరు పొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి, నిడదవోలు కు చెందిన గుంటుపల్లి నాగ సూర్య చంద్రం, కుటుంబ సభ్యులు రూ, 1,00,005 వేంకటేశ్వర స్వామి నిత్య అన్న ప్రసాద నికి విరాళం ని చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డీసీ నల్లం సూర్యచక్రధరరావు లకు అందజేశారు. ఆలయ ఇంచార్జ్ వై శ్రీనివాస్ దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి స్వామి తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

# ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి



- ఏనుగు వీధి రామాలయంలో మహిళల సామూహిక కుంకుమ పూజలు

**కిర్లంపూడి,(మనసులో మాట) జూలై 10:**

హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి,రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని కిర్లంపూడికి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ కాకినాడ జిల్లా కిర్లంపూడి మండల కేంద్రంలోని ఏనుగు వీధి కాపుల రామాలయంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.రామాలయ కమిటీ సభ్యులు,స్థానిక పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రామాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని భగవంతుడిని ప్రార్థించామని తెలిపారు.భగవంతుని కృపతో పాటు ప్రజల ఆశీస్సులు కూడా ఆయనకు మెండుగా ఉన్నాయని,నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏనుగు వీధి కాపుల రామాలయ కమిటీ సభ్యులు,స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు,ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు.



# నేడు నూజివీడులో విద్యుత్ సరఫరా నిలిపివేత

**నూజివీడు (మనసులో మాట) జులై 10:**



నూజివీడు పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఎస్పీడీసీఎల్ పట్టణ ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 33/11 కె.వి సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా డం డం గార్డెన్స్, గాంధీనగర్, యానాదుల కాలనీ, జగనన్న కాలనీ, కుమ్మరిపేట, అజరయ్య పేట, సబ్ కలెక్టర్ ఆఫీస్ ఏరియా, శ్రీనివాస సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, స్టేషన్ తోట, గొడుగు వారి గూడెం, రెడ్డిగూడెం రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

## అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో 78 మంది గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు



**రంపచోడవరం (మనసులో మాట) జూలై 10**

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం

అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా పిఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారంనాడు ప్రతి నెలా9,10 తేదీలలో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం 71 మంది గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్ష లు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి గైనకాలజిస్ట్ డాక్టర్ మోమీనా ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి అలాగే మరి కొంతమంది గర్భిణీలకు అవసరమైన 38 మందికి స్కానింగ్ చేసి 26 గర్భిణీలకు , రక్తహీనత గమనించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మిగతా కొంతమందిని గమనించి డెలివరీ దగ్గరగా ఉన్న వారిని ముందుగా వచ్చి జాయిన్ అవ్వాలని సూచన చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన గర్భిణీలు, ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎంలకు హాస్పటల్ సూపర్డెంట్ పి మహేష్ రెడ్డి భోజన వసతిని ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత కార్యక్రమంలో భాగంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ నారాయణ,అనూష, రేష్మ మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డాక్టర్ మహేష్ రెడ్డి గారు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల వ్యాప్తి, వాటి ప్రధాన లక్షణాల గురించి వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య సలహాలు పొందాలని ఆయన స్పష్టం చేశారు.

గర్భిణీలకు ఆసుపత్రి కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ, గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కొత్తగా వచ్చిన వారికి అలాగే పాత వారికి అవగాహన కల్పించి వివరించారు. ముఖ్యంగా ప్రసవ సమయంలో రక్తహీనత వంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీలు పాల్గొన్నారు. అలాగే ఎల్లవరం పి హెచ్ సి స్టాఫ్ పాల్గొన్నారు.

# హత్య కేసు ఛేదించిన త్రీ టౌన్ పోలీసులు

- **ముగ్గురు నిందితులు అరెస్ట్**
- **సి.ఐ కె.వి.ఎస్. సత్యనారాయణను అభినందించిన**
- **ఎస్పీ బిందు మాధవ్**

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**



కాకినాడ నగరం లో మొజ్జు సతీశ్ హత్య కేసు ను త్రీ టౌన్ పోలీసులు ఛేధించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) మహంతి కిషోర్ కుమార్, సీ.ఐ కె.వి.ఎస్ . సత్యనారాయణ లు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే నెల లో 10వ తేదిన మొజ్జు సతీశ్ మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం రావడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తు లో భాగంగా పోస్ట్ మార్టం రిపోర్ట్ ఆధారంగా హత్య కేసు గా నమోదు చేసి దర్యాప్తు కొనసాగించడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు తో కేసు పై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు ఎస్పీ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు నిర్వహించామని చెప్పారు. దర్యాప్తు లో భాగంగా శుక్రవారం కుంచె ప్రభు తేజ, కుంచె నాని, పెరుగు అంజలి అలియాస్ రాణి లను అరెస్ట్ చేశామని చెప్పారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, మసాలా దాంచే కర్ర, ప్లాస్టిక్ గొట్టం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడు ప్రభు తేజ వద్ద మృతుడు సతీష్ హెల్పర్ గా పనిచేసే వాడని అన్నారు. నిందితుడు ప్రభు తేజ కాకినాడ కుర్రోడు పేరుతో వీడియోలు తీసేవాడని తెలిపారు. మృతి చెందిన సతీష్ ప్రభు తేజ ఇంట్లో 30 వేల రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు దొంగిలించాడని, అవి తిరిగి ఇవ్వకపోవడం తో పాటు దూషించడం వల్ల హత్య చేయాలని పథకం రూపొందించారని దర్యాప్తు లో తేలిందని చెప్పారు. మే 9 తేదీ న మృతుడిని తీవ్రంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశారని చెప్పారు. అనంతరం మృత దేహాన్ని సీ సీ కెమెరాలు లేని మార్గం ద్వారా ద్విచక్ర వాహనం పై తీసుకు వచ్చి సాంబమూర్తి నగర రెండవ వీధిలో చెట్టు కింద పడేశారని వివరించారు. కేసు ను త్వరితగతిన ఛేదించిన త్రీ టౌన్ సి ఐ కె వి ఎస్. సత్యనారాయణ, ఎస్ ఐ సత్యనారాయణ చౌదరి, ఎ ఎస్ ఐ శ్రీనివాసు, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్ మురళీ రాజు లను, క్రైమ్ పోలీస్ సిబ్బంది నీ ఎస్పీ బిందు మాధవ్ తో పాటు జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు

## ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి

- **కొత్తపేట ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట( మనసులో మాట )జూలై 10**




ప్రజా దర్బార్ లో ప్రజలు సమర్పించే వినతుల పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనంతో వ్యవహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం వాడపాలెం, ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామాల్లో ప్రజా దర్బార్ నిర్వహించారు.

గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. మొత్తం ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జుజవరపు హరి, ముళ్ళపూడి భాస్కరరావు, గ్రామస్తులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ప్రతివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

- **కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**

**కాకినాడ, జూలై 10**



కాకినాడ నగరంలోని జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు (డిస్ట్రిక్ట్ కోర్టు) కాంప్లెక్స్‌లో ప్రతి వారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు.శుక్రవారం ఉదయం నగరంలోని 37వ డివిజన్ పరిధిలో ఉన్న జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయాల పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రభుత్వ కార్యాలయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఇకపై ప్రతి వారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ, పరిసరాల శుభ్రత పనులను క్రమం తప్పకుండా చేపడతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం నగరపాలక సంస్థ బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎ. సత్తిబాబు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండి నరేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన



- **మత్స్యశాఖ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

జాతీయ చేపల రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడియం లోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ, 1957 జూలై 10వ తేదిన ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఉన్న సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి డాక్టర్ అలీ కున్హీ మెజర్ కార్ప్ చేపల విజయవంతమైన ప్రేరేపిత సంతానోత్పత్తి (ఇండకడ్ బ్రీడింగ్ ) సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జూలై 10 వ తేదిని జాతీయ చేపల రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు.ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాణ్యమైన చేపల విత్తనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, మత్స్యరంగ అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. ప్రపంచంలో మంచినీటి చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో కొనసాగుతున్నదని తెలిపారు. చేపల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఉపాధి వనరుగా మారి వేలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తోందని నిర్మల కుమారి తెలిపారు. చేపలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారమని, ఆహార భద్రతకు కూడా అవి కీలకమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి చేపల విత్తనాలు వదలడం ద్వారా ఆహార ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని కూడా పెంచవచ్చని సూచించారు.ఈ సందర్భంగా అక్వా రైతులు మత్స్యరంగ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న విశేష సేవలను గుర్తించి సత్కర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్, అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జేఏసీ ఏ. సత్తిబాబు, జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత పాటించండి

**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై 10;**



దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వైరస్, ఎల్లో ఫీవర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. వీటి ద్వారా తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనీ, దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలనీ, పరిసరాల పరిశుభ్రత పాటించండి అని ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత అన్నారు. శుక్రవారం ఉమ్మడివరం గ్రామంలో రేఖపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న 11 మంది కి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కోతులు గుట్ట ఆసుపత్రికి రిఫేర్ చేయడం జరిగిందని తెలిపారు. వారు అక్కడ వైద్యం పొందుతున్నారని గ్రామంలో తమ సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టామని, గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత వాడే నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు కొత్త నీరు ఉండేలా చూడాలని, అలా ఉండకపోతే లార్వా అభివృద్ధి చెంది వాటి ద్వారా డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెందుతాయని, అందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు నివారణకు హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుంది అని ఆమె తెలిపారు. వాగు నీరు, గోదావరి నీళ్లను గ్రామాల వారు కచ్చితంగా కాచి చల్లారిసి వడపోసుకుని తీసుకోవాలని సూచించారు. ఉమ్మడివరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పిహెచ్ఎన్ భద్రకాళి, స్థానిక ఆశ వర్కర్ ఏఎన్ఎం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అయినవిల్లి మండలంలో 83శాతం (సర్ )ప్రక్రియ పూర్తి

- **తహసిల్దార్ విద్యాపతి**

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 10 :**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ప్రక్రియ అయినవిల్లి మండలంలో 83 శాతం పూర్తయినట్లు తహసిల్దార్ విద్యాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బిఎల్ఓ లు 21 గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ శర వేగంతో నిర్వహిస్తున్నామని తాహసిల్దార్ తెలిపారు. మిగిలిన 17 శాతం మూడు రోజుల్లో పూర్తి చేస్తామని దీనికి సంబంధించి ఓటర్ల సవరణ కార్యక్రమంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి, ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి బిఎల్ ఓ లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.



# రోడ్డు ప్రమాదానికి గురైన విద్యార్థికి అక్షర విద్యా సంస్థలు ఆర్థిక సాయం



**జగ్గంపేట (మనసులో మాట) జూలై 10:**

అక్షర జూనియర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. చదువుతున్న యర్రా వీరవెంకట రమణ అనే విద్యార్థి ఇటీవల ఒక తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న కాలేజీ యాజమాన్యం,అక్షర విద్యాసంస్థలు మానవతా దృక్పథంతో స్పందించి, ఆ విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం 50,000/ (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ ఆర్థిక సహాయాన్ని అక్షర విద్యా సంస్థల చైర్మన్ పాటంశెట్టి సతీష్ బాబు, కరస్పాండెంట్ ఆళ్ళ రవి కిషోర్,ప్రిన్సిపాల్ నీలం చక్రధర్,కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది మరియు తోటి విద్యార్థుల సహకారంతో బాధితుడి కుటుంబానికి అందజేయడం జరిగింది. ప్రమాదానికి గురైన విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# ప్రమాదకరంగా ఉన్న చింత చెట్టుకొమ్మలు తొలగించారు

**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై10;**



శ్రీరామగిరి గ్రామం వద్ద ఇటీవల గాలివాన బీభత్సం సృష్టించి చింతచెట్టు కొమ్మలు విరిగి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను తొలగించాలని, వివిధ పత్రికల్లో వార్తలు రావటంతో స్పందించిన అధికారులు శ్రీరామగిరి గ్రామానికి చెందిన వల్లి సుందరం ఇంటి పైన విరిగి వేలాడుతున్న చెట్టు కొమ్మలను చెట్టును ఎంపీడీవో ఇమ్మానియేలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ శ్రీరామగిరి మాజీ ఉపసర్పంచ్ గుండెపూడి లక్ష్మణరావు ప్రత్యేక చొరవతో గురువారం చెట్టు కొమ్మ లను సిబ్బందితో తొలగించారు. అయితే కొన్ని కొమ్మలు ఇంటిపై పడడంతో ఇంటి పై కప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. అదే ముందుగానే కొమ్మలు తొలగించి ఉంటే ఇంటి రేకులు పగిలేయి కావని బాధితుడు వాపోయాడు. చెట్టును తొలగించడంలో జాప్యం జరిగినప్పటికీ పూర్తిగా ప్రమాదంగా ఉన్నటువంటి అన్ని కొమ్మలను తొలగించినటువంటి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఇమ్మానియేల్ ను వారి కృషిని వారి సిబ్బందినీ గ్రామస్తులు, బాధితులు ధన్యవాదాలు తెలిపారు.



## వాహన తనిఖీలు.. రోడ్డు భద్రతపై అవగాహన...



**మండపేట మనసులో మాట జూలై 10**

మండపేట రూరల్ సర్కిల్ పరిధిలోని ఇప్పనపాడు గ్రామంలో పోలీసులు శుక్రవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించినట్లు మండపేట రూరల్ సీఐ పి. దొర రాజు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి. కిషోర్, ఏఎస్ఐ వైకుంఠరావు, హెడ్ కానిస్టేబుల్ కుమార్, పీసీలు సత్యనారాయణ, ఆకుల సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మామిడికుదురు మండల టీడీపీ అధ్యక్షులు బోనం బాబు తల్లికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నివాళి



**పి గన్నవరం జూలై 10 (మనసులో మాట)**

మామిడికుదురు మండలం, లూటుకుర్రు గ్రామానికి చెందిన మామిడికుదురు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బోనం బాబు తల్లిశుక్రవారం మృతి చెందింది ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ లూ టుకు ర్రు గ్రామానికి చేరుకుని,బోనం బాబు తల్లి పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బోనం బాబు తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చు పలికారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తం కాకపోతే ఓటు హక్కుకు ముప్పు...

- **టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్...**

**మండపేట ( మనసులో మాట) జూలై 10**

సర్ ప్రక్రియ పట్ల అప్రమత్తం కాకపోతే ఓటు హక్కుకు ముప్పు ఏర్పడుతుందని

టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు.మండపేట లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆన్లైన్‌లోనూ ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణను ఆన్లైన్ ద్వారా కూడా పూర్తి చేయవచ్చనీ పేర్కొన్నారు.

ఇక మిగిలింది 5 రోజులే అని పేర్కొన్నారు.గడువు ముగియడానికి కేవలం ఐదు రోజులు మాత్రమే సమయం ఉందన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా, వివరాలు నింపిన ఎన్యూమరేషన్ పత్రాలను వెనక్కి ఇవ్వడానికి కేవలం 5 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో చాలా మంది ఓటర్లకు ఇప్పటికీ ఎన్యూమరేషన్ పత్రాలు అందలేదని తెలుస్తోందన్నారు.

# సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో





- **విద్యార్థులకు 3000 నోట్‌బుక్స్ పంపిణీ**
- **పూల బొకేలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌బుక్స్ అందించాలన్న**
- **ఎంపీ సానా సతీష్ బాబు పిలుపుకు విశేష స్పందన**

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఇటీవల నగరానికి వచ్చిన సందర్భంగా తనను మర్యాద పూర్వకంగా కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలు తీసుకురావడం కంటే,పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తీసుకు రావాలని చేసిన పిలుపుకు విశేష స్పందన లభించింది. ఆ సందర్భంగా అందిన దాదాపు 3000 నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను ఎగ్జామ్స్ ప్యాడ్స్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు నగరంలోని ప్రజా విద్యాలయం ,ఎంపీపీఎస్ ప్రైమరీ మోడల్ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ,పూల బొకేలు కొన్ని క్షణాల ఆనందాన్ని ఇస్తే, ఒక నోట్‌బుక్ విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేస్తుందనే ఆలోచనతో ఎంపీ సానా సతీష్ బాబు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు, నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత సేవ కావడమే సానా సతీష్ బాబు ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ తలాటం హరీష్,ఎంపీ కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, ఆనంద్ న్యూటన్ ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వర రావు, ఎంపీ వ్యక్తిగత సహాయకులు (పీఏ) గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా

- **ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి**
- **ఆర్డీవో కె. ఆనందరావు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ సర్ ) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కె. ఆనందరావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం చాగల్లు మండలంలోని పోలింగ్ స్టేషన్ నెం. 112 ను తహసీల్దార్ ఎమ్ మెరికమ్మ తో కలిసి ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల మ్యాపింగ్, ఇంటింటి ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. పనులను నాణ్యతతో, ఖచ్చితత్వంతో నిర్వహిస్తూ భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు చేయబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారం లు స్వీకరించడం జరిగింది.ఈ పరిశీలనలో చాగల్లు తహసీల్దార్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# విత్తనాల పంపిణీ ని నిలిపివేసిన రైతాంగం



**వి.ఆర్.పురం.(మనసులోమాట) జూలై 10;**

వి ఆర్ పురం మండలం ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులకు విత్తనాలు 1500 బ్యాగులు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి కేవలం 1000 బ్యాగులు మాత్రమే పంపించి రైతులకు పంపిణీ చేసే క్రమంలో ఎవరికి సరిపోని విత్తనాలు పంపించి పంపిణీ చేయమంటే ఎలా సాధ్యమవుతుందని రైతులందరూ మండల ఎంపీపీ కారం లక్ష్మి సారథ్యంలో ఆందోళన చేసి ఆ పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మీ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ సాగుకు రైతులు వరి నార్లు పోయడంలో వెనకబడ్డారని, దీనికి కారణం ప్రభుత్వం నుంచి రావాల్సిన విత్తనాలు ఆలస్యమే అని, ఇప్పటికైనా అందరికీ సరిపడా విత్తనాలు పంపిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తుంటే, చాలీచాలని విత్తనాలు పంపడంలో రైతుల పట్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇంకా పంపాల్సిన 500 బ్యాగులు తెప్పించి రైతులను ఆదుకోవాలని లేదంటే రైతులందరినీ తీసుకొని వెళ్లి ఐటీడీఏ కార్యాలయం ముందు కూర్చుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులు, మహిళా రైతులు, స్థానిక సర్పంచ్ సవలం.మారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.





**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై 10;**
మండలంలోని ఉమ్మడివరం, రెడ్డిగుంపు నాగేంద్ర పురం, రామాపురం తదితర గ్రామాలలో ప్రజానీకం డెంగ్యూ, మలేరియా జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వైద్య అధికారులు గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని మండల ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని పిహెచ్సీ ని పరిశీలించి అక్కడ ఉన్న రోగుల ఆరోగ్యపరమైన విషయాలను, వారికి జరుగుతున్న వైద్యతీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఉమ్మడివరం, రెడ్డి గుంపు గ్రామాలలో ఎక్కువగా డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడి ప్రజలు అనారోగ్యాలకు గురైన వారి దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పర్యటనలో ఉన్న జిల్లా వైద్య అధికారులు డి ఎం అండ్ హెచ్ ఓ, అడిషనల్ డి ఎం హెచ్ ఓ లను కలిసి తక్షణమే డెంగ్యూ, మలేరియా నివారణ కొరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఇంటి ఇంటికి వెళ్లి ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య అధికారులను కోరారు. దానితోపాటుగా ఏజెన్సీలోని దోమ కాటు ఎక్కువగా ఉన్నదని, దోమల నివారణ కొరకు దోమల మందు పిచికారి చేయించి, తక్షణమే దోమతెరలు పంపిణీ చేయాలని వారిని కోరారు. ఉమ్మడివరం గ్రామంతో పాటు రెడ్డిగుంపు, నాగేంద్రపురం, రామాపురం మొదలైన గ్రామాలన్నింటిలో ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలని, మండలంలో ఒకే ఒక్క డాక్టర్ ఉండడం వలన పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, గ్రామాల్లో క్యాంపులకు ఉన్న ఒక డాక్టర్ వెళ్తే, హాస్పిటల్లో డాక్టర్ లేని పరిస్థితి నెలకొందని తక్షణమే మరో డాక్టర్ ను నియమించాలని, రానున్నది వరదల కాలము కాబట్టి అదనపు డాక్టర్ నియమించి వైద్యం అందించాలని తెలిపారు. డెంగ్యూ వైద్య నివారణ కొరకు ప్రతి ఒక్కరూ కోతులగుట్ట వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రేఖపల్లి పిహెచ్సి లో కూడా డెంగ్యూ కి సంబంధించిన మందులు ఉంచి ట్రీట్మెంట్ చేయించాలని జిల్లా అధికారులను ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. స్పందించిన జిల్లా అధికారులు తక్షణమే మరో డాక్టర్ ను ఏర్పాటు చేసే విధంగా పై అధికారులతో మాట్లాడతామని, డెంగ్యూ కి కూడా రేఖపల్లి హాస్పిటల్లో వైద్యం అందించేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని, గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించి డెంగ్యూ మలేరియా జ్వరాలను నివారణ చేయడం కోసం ప్రయత్నం చేస్తామని ఎంపీపీ కి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం.శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు. సత్యనారాయణ, కుంజ కన్నయ్య, నాల్లారపు.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే అభివృద్ధి సంక్షేమాలు;





• **ఎమ్మెల్యే చినరాజప్ప**

**సామర్లకోట (మనసులో మాట)జూలై 10;**
కూటమి పాలనలోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు సాధ్యపడతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టౌన్ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. గత వైసిపి పాలనలో రాష్ట్రం హస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో అభివృద్ధికి శ్రీకారం చుట్టడమే కాకుండా, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమాల విశిష్టతను నేతలు ప్రజా ప్రతినిధులు ప్రజలకు చాటి చెప్పాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సమావేశ అనంతరం పట్టణంలోని 10,11 వార్డుల్లో విజయోత్సవ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ పార్టీ నేతలు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, అందుగుల జార్జి చక్రవర్తి, గోల్టీ సత్యనారాయణ, నిమ్మకాయల కిరణ్, గంగాధర్, మునిరెడ్డి శ్రీరాములు, యార్లగడ్డ రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ అందుగుల మణికుమారి, మహిళా నేతలు రామలక్ష్మి, పిల్లా సత్యవతి, సుష్మా మోహిని, కాళ్ల రవీంద్ర, కాపవరపు కుమార్, పడాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు

# ముద్రగడ త్వరగా కోలుకోవాలని కిర్లంపూడి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

**కిర్లంపూడి,(మనసులో మాట) జూలై 10:**
హైదరాబాద్ సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మసీద్ కమిటీ పెద్దలు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి రావాలని శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడమే కాకుండా, అల్లాను వేడుకున్నామన్నారు. అల్లా ఆశీస్సులతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి వస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్, ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా, షేక్ ఇబ్రహీం(ఐ జి ) షేక్ అహ్మద్, షేక్ బషీర్, షేక్ కాలేషా, షేక్ కరీముల్లా షా, పలువురు కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# ద్వారపూడిలో రూ.15.75 లక్షలతో ఎస్.సి కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన...



**మండపేట ( మనసులో మాట) జులై 10**
మండపేట మండలం, ద్వారపూడి గ్రామంలో ఎస్.సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షిస్తూ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళకు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఎస్.సి సామాజిక వర్గ ప్రజల చిరకాల కోరికైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సి.ఎస్.ఆర్ గ్రాంటు ద్వారా రూ.15.75 లక్షలు నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన చేయడంపై స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారు చోరీ



గండేపల్లి (మనసులో మాట) జూలై 10:

నిద్రిస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారం చోరీకి గురి అయ్యింది.గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండేపల్లి మండలం కే.గోపాలపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఆవరణను నిద్రిస్తున్న బి .సావిత్రి అనే మహిళ నుండి నగలు ను దుండగులు అపహరించారు. శుక్రవారం జగ్గంపేట సీఐ తిరుపతి రావుమరియు గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబు లు బాధితురాలు వద్ద నుండి వివరాలు సేకరించారు. ఇంటిలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి నగలు అపహరించడంతో జగ్గంపేట సిఐ తిరుపతిరావు గోపాలపురం గ్రామానికి చేరుకుని బాధితురాలతో నేలపై కూర్చుని వివరాలు సేకరించారు. నిందితులను పట్టుకొని బాధితురాలకు న్యాయం చేస్తామని సీఐ తిరుపతిరావు తెలిపారు.

## ఎంఆర్‌పి రేటు కంటే రూ.10 నుండి రూ.20 అదనపు వసూళ్లు......

- **పట్టించుకోని అధికారులు. విలవిల్లాడుతున్న మందుబాబులు.....**
- **తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.....**

**చింతలపూడి( మనసులో మాట) జూలై 10 :**

ఏలూరు జిల్లా చింతలపూడి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు మద్యం దుకాణాల్లో అక్రమ వసూళ్ల పర్వం జోరుగా సాగుతోంది. అని సమాచారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన 'ఎంఆర్‌పి' (గరిష్ట విక్రయ ధర) కంటే అదనపు ధరలకు విక్రయిస్తూ మందు బాబుల జేబులకు నిర్వాహకులు చిల్లులు పెడుతున్నారు. ప్రతి క్వార్టర్ బాటిల్ లేదా బీరుపై రూ. 10 నుండి రూ. 20 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**నిబంధనలు బేఖాతర్.. బోర్డులు మాయం!**

నిబంధనల ప్రకారం ప్రతి మద్యం దుకాణం ముందు ధరల పట్టిక ప్రదర్శించాల్సి ఉండగా, మండలంలోని పలు దుకాణాల్లో అది ఎక్కడా కనిపించడం లేదు. ఎవరైనా కస్టమర్లు రేటు ఎందుకు ఎక్కువ అని ప్రశ్నిస్తే... "మాకు పై మామూళ్లు, రవాణా ఖర్చులు ఎక్కువవుతున్నాయి.. నచ్చితే తీసుకోండి లేదంటే లేదు" అంటూ నిర్వాహకులు దురుసుగా సమాధానం చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజల అభ్యర్థన.. తక్షణ చర్యలు అవసరం!**

ఈ దోపిడీపై చింతలపూడి మండల ప్రజలు, పలువురు సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, చింతలపూడి మండలంలోని మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు అమ్ముతున్న దుకాణాల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పిచ్చుకలంకలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- **పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట (మనసులో మాట )జూలై 10**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్ద ఈ నెల 13వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు చేపడుతున్న ఏర్పాట్లను కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పరిశీలించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో కలిసి పిచ్చుకలంక ప్రాంతంలో పర్యటించి సభా వేదిక, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీరు, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. పిచ్చుకలంక ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్ రాజు, జల్లి కామేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో పునః నిర్మాణ పనులు స్థపతి ఎడ్వైజర్ సుందరరాజన్

- **చరిత్రలో నిలిచిపోయేలా నిర్మాణం**
- **వెయ్యి సంవత్సరాలైన చెక్కుచెదరదు**
- **గ్రామ ప్రజలు అదృష్టవంతులు**

**ఐ పోలవరం మండలం, మనసులో మాట, జూలై 10:**



మురమళ్ల లో నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణ పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం గా జరుగుతున్నాయని దేవాదాయశాఖ స్థపతి ఎడ్వైజర్ శ్రీ సుందరరాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ పునః నిర్మాణ పనులను చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ మాట్లాడుతూ శ్రీ స్వామి వారి ఆలయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనుభవజ్ఞులై శిల్పి లతో ఆలయాన్ని నిర్మిస్తున్నారని ఇప్పుడు నిర్మించే ఆలయం సుమారు వెయ్యి సంవత్సరాలైన చెక్కుచెదరకుండా నిర్మాణం రూపుదిద్దు కుంటోందని తెలిపారు. ప్రస్తుతం బేస్ మెంట్ పనులు పూర్తఅయ్యి గర్భాలయానికి సంభందించిన జరుగుతున్నాయని పనులు శాఖ పరంగా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. గ్రామ ప్రజలు ఎంతో అదృష్టం చేసుకొన్నారని అన్నారు. నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమూనా పరిశీలించారు. పలు సూచనలు సలహాలు అందించారు. ఏర్పాట్లు అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. తొలుత స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. శేష వస్త్రం, ప్రసాదం చిత్ర పటం అందించి వేద ఆశీర్వచనం అందించారు.

# మరిడమ్మ జాతర పక్కా భద్రత; డీఎస్పీ తిలక్





**పెద్దాపురం (మనసులో మాట) జూలై 10;**

పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆషాఢ మహా జాతరకు పక్కాగా భద్రత ఏర్పాటులు చేపడతామని పెద్దాపురం డిఎస్పి బాలగంగాధర్ తెలిపారు. శుక్రవారం పెద్దాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కే శ్రీనివాసరావు తో కలిసి మరిడమ్మ తల్లి ఆలయాన్ని, ఆలయ పరిసరాలను పరిశీలించారు. జూలై 13 నుండి మరిడమ్మ తల్లి ఆషాఢ మహా జాతర వేడుకలు 45 రోజులపాటు జరగనున్నాయి. దేశ నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆషాఢ జాతరకు తరలివస్తారు. అమ్మవారి మహా జాతర వేడుకలను పురస్కరించుకొని క్యూలైన్లు, అత్యవసర ద్వారం, విఐపి దర్శన ఏర్పాట్లు, తదితర అంశాలపై డిఎస్పి బాలగంగాధర్ తిలక్ పరిశీలన చేశారు. ఆషాఢ ఉత్సవాల భద్రత ఏర్పాట్లపై దేవాలయ అధికారులకు, పోలీసులకు డిఎస్పి తిలక్ పలు సూచనలు, సలహాలు అందించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆలయ ప్రతినిధులు రమణ, క్రాంతి, శివ, అర్చకులు పోలీసులకు వివరించారు.